క్లుప్తంగా

సీఎంకు ఆత్మీయ స్వాగతం



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇర్రిపాకలోని హెలిపాడ్ వద్ద సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

కళాశాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే వరప్రసాదరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

రాజోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం రాజోలు కళాశాల ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో జిల్లా డీవీఈఓ ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యే రాపాకను ఘనంగా సత్కరించింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.గణేశ్వరరావు, పి.నరసింహరాజు, ఎం.అంబేడ్కర్, కె.శ్రీరాములు, బీఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. 33 కేవీ లైన్లో, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. పెదపట్నం, నగరం, మామిడికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, మొగలికుదురు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

పి.గన్నవరం: ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. బుధవారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంత వరకూ జరిగిన కొత్త ఓట్ల నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పుల వివరాలను రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, ఆర్ఐలు అహ్మద్ అలీ, నరసింహారావు, రాజకీయ పార్టీల నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, షేక్ దొరబాబు, చిట్టాల రామజోగేశ్వరరావు, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహరం

రాజోలు: ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణతో బోధనా నైపుణ్యం పెంచుకోవాలని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. బుధవారం రాజోలు కోఆపరేటివ్ స్కూల్‌లో మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు జరిగాయి. విద్యా శాఖ విడుదల చేసిన టైం టేబుల్ మేరకు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, కార్యదర్శుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు బోధనా అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణకు మండలంలోని ఉపాధ్యాయులంతా హాజరయ్యే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు.

మోకాళ్లపై నిల్చుని నిరసన

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి దేవస్థానం కేశఖండనశాలలో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణుల ఆందోళన బుధవారంతో ఐదో రోజుకు చేరింది. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వారు మోకాళ్లపై నిల్చుని అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసి జీవో 110ని అమలు చేయాలని, నెలకు రూ.20 వేల కనీస వేతనం చెల్లించాలని అన్నారు. సంఘ అధ్యక్షుడు రామేశ్వరపు నాగవీరవెంకట సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీరవెంకట దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- కాపు కల్యాణ మండపం ప్రారంభం



ఆలమూరులో కాపు కల్యాణ మండపం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే చిర్ల తదితరులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆలమూరులో రూ.50 లక్షలతో నిర్మించిన కాపు కల్యాణ మండపాన్ని బుధవారం వారు ప్రారంభించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షత వహించారు. తొలుత ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రజలందరి సంక్షేమానికి బాటలు వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాల కింద అర్హులందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానంటే అన్ని వర్గాల ప్రజల ఆదరణే కారణమన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నానన్నారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 50 లక్షలు మంజూరు చేయగా శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం నిర్మించడం శుభపరిణామం అన్నారు. ఈ కల్యాణ మండపానికి ఇంకా మిగిలివున్న పనులను పూర్తి చేసేందుకు జిల్లా పరిషత్ నిధులు నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించానని ఆయన ప్రకటించారు. అనంతరం కాపు కల్యాణ మండపం శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కల్యాణ మండపం నిర్మాణానికి శ్రమించిన పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడు చల్లా ప్రభాకరరావును ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా నానాజీ, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష

ఆలమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని, వీటితో పేదల జీవితాలకు వెలుగులు వచ్చాయని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆలమూరులో బుధవారం వారి సమక్షంలో సుమారు 200 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో చేరిన యువకులకు వారిద్దరూ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఆలమూరుకు చెందిన గోపిశెట్టి వీరబాబు, చల్లా గోపాలకృష్ణ, చల్లా అవినాష్ తదితరులు ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

నిరంతర సాధనతో విజయం



అంబాజీపేటలో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న రాజ్‌గోపాల్, హెచ్‌ఎం సాయిరామ్

అంబాజీపేట: నిరంతర సాధనతో క్రీడల్లో విజయం సాధించవచ్చని హెచ్‌ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన కొర్లపాటి రాజగోపాల్ ఆధ్వర్యంలో రూ.11 వేల విలువైన క్రీడా సామగ్రిని స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా పరికరాలను హెచ్‌ఎం సాయిరామ్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిలకు అందజేశారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర కలశ పూజ



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో అష్టోత్తర కలశపూజ చేస్తున్న భక్తులు



అంతర్వేదిలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అష్టోత్తర కలశ పూజ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఊరేగింపుగా తీసుకు వచ్చిన గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అలాగే ఆలమూరులోని శ్రీసంతోషిమాత ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

అంతర్వేదిలో నవవార దీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నవవార, నవప్రదక్షిణ దీక్షలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి అనుగ్రహంతో పాటు, సకల అభీష్టాలు నెరవేరడానికి ఈ ప్రదక్షిణ తోడ్పాటు ఇస్తుందని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు తెలిపారు. తొలుత స్వామివారి సన్నిధిలో భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆలయ ప్రదక్షిణను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు.

అంబాజీపేట: నందంపూడి శివారు పెచ్చెట్టివారిపాలెంలో లక్ష్మీగణపతి స్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెచ్చెట్టి లక్ష్మీ నాగేశ్వరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. యలమంచలి సుబ్రహ్మణ్యశర్మ, చంద్రమౌళి సురేష్ శర్మ పర్యవేక్షణలో పెచ్చెట్టి వీరవెంకట సత్యనారాయణ, కృష్ణవేణి దంపతులు, భక్తులచే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుబ్బల మాధవేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: బెల్లంపూడి శివారు తాడాలవారిపాలెంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో వరసిద్ధి వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 28 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఆధార్‌తో అనుసంధానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ మధుసూదనరావు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరినీ ఈ నెలాఖరు లోగా ఆధార్‌తో అనుసంధానం చేయించాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ రావు ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుంచి ఆధార్‌తో అనుసంధానమైన కూలీలకు మాత్రమే వేతనాలు పడతాయన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఎం బొంతు చంద్రమోహన్ అధ్యక్షతన పి.గన్నవరం క్లస్టర్ పరిధిలోని 8 మండలాలకు చెందిన ఏపీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 98 శాతం కూలీలను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారిని కూడా చేయించాలని, లేకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాలని, కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీడీ జి.కవిత, ప్లానిటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్ పాల్గొన్నారు.

బాలాజీస్వామి ఆలయంలో ఇన్వర్టర్ ఏర్పాటు



పాత బాలాజీస్వామి గుడిలో ఇన్వర్టర్‌ను ప్రారంభిస్తున్న ఈఓ మాధవి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి పాత ఆలయంలో స్టీల్ క్యూలైన్ ఏర్పాటుకు నగరం గ్రామానికి చెందిన రొక్కాల రాజారావు, వారి కుటుంబ సభ్యులు బుధవారం రూ.90 వేలు సమర్పించారు. రూ.20 వేలతో ఇన్వర్టర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ వీటిని ప్రారంభించారు. దాతతో పాటు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా శ్రీబాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయ దేవేరులతో కొలువు దీరిన స్వామివారిని దర్శించుకున్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సదస్సులో మాట్లాడుతున్న హెచ్‌ఎం హబీబ్ ఉన్నీషా బేగం

మలికిపురం: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం హబీబ్ ఉన్నీసా బేగం అన్నారు. బుధవారం చింతలమోరి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో స్పందన, ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇదా ఫౌండేషన్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు నక్క రమేష్‌బాబు, సభ్యుడు పి.సూర్యనారాయణ రాజు పలు అంశాలు వివరించారు. హెచ్‌ఎం బేగం మాట్లాడుతూ విద్యార్థులలో వస్తున్న మార్పులను గమనించాలని, దానికి అనుగుణంగా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆచంట పెద్దిరాజు, కందికట్ల లతా, అడబాల వాణి, నరసింహారావు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ప్రభాకరరావుకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో డయాలసిస్ పేషెంట్ చొప్పల ప్రభాకరరావుకు బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొద్ది రోజులుగా రెండు కిడ్నీలు దెబ్బతిని రెండు రోజులకొకసారి అతడు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. వైద్య ఖర్చులకు కువైట్ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రా యూత్ వ్యవస్థాపకులు మోకా స్వామి, ఇంజేటి కృష్ణకుమార్, అధ్యక్షుడు ఇంజేటి శ్యాంబాబు పైమొత్తాన్ని సమకూర్చారు. పాస్టర్ బత్తుల రాజబాబు, సంస్థ కార్యదర్శి గెడ్డం రామారావు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను సత్కరించిన నాయకులు

అల్లవరం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను బుధవారం బోడసకుర్రు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు. వీఆర్‌ఓ గెద్దాడ సత్యనారాయణ, వీఆర్‌ఏ తొండవరపు దుర్గారావు, పారిశుధ్య కార్మికుడు సాపే గణపతిరావు, బదిలీపై వెళ్లిన సర్వేయర్ హేమలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బస్వాని పద్మ, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, మట్టపర్తి షణ్ముఖరావు, దొమ్మేటి శ్యాంప్రకాష్, చెల్లుబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముస్లింల పాదయాత్ర



నగరం నుంచి పాశర్లపూడి వరకూ పాదయాత్రలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ 'నజఫ్ నుంచి కర్బలా' వరకూ చేసిన పాదయాత్రను స్మరిస్తూ ముస్లింలు పాదయాత్ర నిర్వహించారు. నగరం నుంచి పాశర్లపూడి వరకూ జరిగిన ఈ పాదయాత్రలో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొని హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని పంజీషా నుంచి పాశర్లపూడిలోని బీబీ ఫాతిమా జహేరా దర్గా వరకూ జరిగిన పాదయాత్రలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అంజుమనే ఘాజి అబ్బాస్, అంజుమనే పార్వనయే హుస్సేన్ భక్త బృందాల ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరిగింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అల్లవరం: ఓడలరేవులో కొబ్బరి చెట్టు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మోకా నరసింహారావు(48) బుధవారం మృతి చెందారని ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఘటనపై నరసింహారావు కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ బాధితునికి రూ.25 వేల సాయం

అమలాపురం టౌన్: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామానికి చెందిన దోనిపాటి సందీప్ వైద్య ఖర్చుల కోసం గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.25 వేలు సమకూర్చింది. విశాఖపట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందీప్ కుటుంబీకులకు ఫౌండేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం రూ.25 వేల చెక్కును అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల నిరసన

కొత్తపేట/రావులపాలెంఆలమూరు/అంబాజీపేట: కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, అంబాజీపేటలలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల కార్యాలయాల వద్ద బుధవారం దస్తావేజు లేఖర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న కార్డ్ ప్రైమ్ 2.0 విధానంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. అలాగే తాము ఉపాధి కోల్పోతామని వారు అన్నారు. రావులపాలెంలో సబ్ రిజిస్ట్రార్ ఎస్.రేవంత్, తహసీల్దార్ మృత్యుంజయరావులకు వినతి పత్రాలు అందజేశారు. కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముక్కు వెంకట్రావు, తమ్మిరాజు, ఆకెళ్ల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంబాజీపేటలో లేఖర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు యర్రాప్రగడ వెంకటేశ్వరరావు, వాడ్రేవు సీతారామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన



మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ఇటీవల శ్రీకాకుళంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన రావులపాలేనికి చెందిన పలువురిని బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. బంగారు పతకాలను క్రీడాకారులు పి.శామ్యూల్, పి.గ్రేస్, కె.మధుహాసిని, కేకే సంజయ్, పి.యోధ, కె.అభిరామ్‌రెడ్డి, సిల్వర్ పతకాలను పి.బన్నీ శర్వాణ్, కేఎస్ తేజస్విన్, బ్రాంచ్ మెడల్ పి.తారక్ శ్రీనాగిరెడ్డి పొందారని కోచ్ సంధ్యారాణి తెలిపారు. వీరితో పాటు కోచ్ సంధ్యారాణిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందించారు.

దోమల నివారణకు చర్యలు



రావులపాలెంలో గంబూషియా చేపలను వదులుతున్న ఉప సర్పంచ్ మునిరెడ్డి తదితరులు

రావులపాలెం: స్థానికంగా దోమల నివారణకు వైద్య శాఖ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ప్రారంభించారు. స్థానిక ఇందిరా కాలనీ, ఆదిలక్ష్మీనగర్ డ్రైన్‌లలో గంబూషియా చేపలను వదిలారు. ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ హసీనా మాట్లాడుతూ ఈ చేపలు దోమల లార్వాను తింటాయని, దీనివల్ల దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. వార్డు సభ్యులు సఖినేటి వాకులరాజు, వెలగల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు ఎస్సైగా శ్రీనివాస నాయక్

ఆలమూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా శ్రీనివాస నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన ఎస్.శివప్రసాద్ ముమ్మిడివరం పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

బీజేపీ సంతకాల సేకరణ

మామిడికుదురు: 'మన దేవాలయం- మన హక్కు' కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ ఆలయం వద్ద భక్తుల నుంచి సంతకాలు సేకరించారు. హిందూ దేవాలయాల పాలక మండళ్లలో అన్యమతస్తులను నియమించడాన్ని నిరసిస్తూ భక్తుల నుంచి సంతకాలు సేకరించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా పాల్గొన్నారు.

బుద్ధవిహార్ ట్రస్టులో ప్రార్థనలు

మామిడికుదురు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ బుధవారం బుద్ధ విహార్ ట్రస్టులో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఆదుర్రు సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో సాగాలి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శైలజ

కొత్తపేట: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ సూచించారు. బుధవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కామర్స్ అండ్ పొలిటికల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షత వహించగా సీనియర్ సివిల్ జడ్జి శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని విద్యాభ్యాసం సాగించాలన్నారు. క్రమశిక్షణ, సోదరభావం విద్యార్థుల ప్రధాన లక్షణాలు కావాలన్నారు. ర్యాగింగ్ వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని హెచ్చరించారు. హైకోర్టు న్యాయవాది పి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యవాడ సందీప్‌కుమార్, సీనియర్ న్యాయవాది డి.బాలప్రతాప్ పాల్గొన్నారు.